# నమస్తే తెలంగాణ

# కరీంనగర్

5 | కరీంనగర్, శనివారం 21 డిసెంబర్ 2024 | KARIMNAGAR




# విలీనంపై వ్యతిరేకత!

- కరీంనగర్ నగరపాలక సంస్థలోకి కొత్తపల్లి మున్సిపాలిటీ, ఐదు గ్రామాలు
- విలీన గ్రామాల్లో నిలిచిపోనున్న 'ఉపాధి'

కరీంనగర్ కార్పొరేషన్, డిసెంబర్ 20 : కరీంనగర్ నగరపాలక సంస్థలో మరో ఐదు గ్రామాలతోపాటు కొత్తపల్లి మున్సిపాలిటీని విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడంపై వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఇప్పటికే ఈ విలీనాన్ని వ్యతిరేకిస్తూ ఆయా గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆందోళనలు చేస్తూనే ఉన్నా.. ప్రభుత్వం మాత్రం విలీనానికే ముందుకు సాగుతున్నది. ఇప్పటికే నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు సైతం విలీనాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర మున్సిపల్ శాఖకు లేఖ రాశారు. ముఖ్యంగా ఇప్పటికే నగరపాలక సంస్థలో విలీనమైన ఎనిమిది గ్రామాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి సాగలేదని, మరిన్ని మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రతి డివిజన్‌కు రూ.50 కోట్లకు పైగానే నిధులను ప్రభుత్వం కేటాయించాలని కోరారు. విలీన గ్రామాల్లోనూ పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగకపోగా.. ఇప్పుడు కొత్తపల్లి మున్సిపాలిటీతోపాటు కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్, గోపాల్‌పూర్, బొమ్మకల్, కొత్తపల్లి మండలంలోని చింతకుంట, మల్కాపూర్ గ్రామాలను విలీనం చేయనున్నారు. ప్రస్తుతం 60 డివిజన్లు ఉండగా.. తాజాగా చేయనున్న విలీనంతో 66 డివిజన్లకు పెంచనున్నారు. అయితే, ఇక్కడి పరిస్థితులను పరిశీలిస్తే నగరపాలక సంస్థపై మరింత భారం పెరిగే ప్రమాదం ఉన్నది.

### అభివృద్ధి సాగేనా..?

గ్రామాలను నగరపాలక సంస్థలో విలీనం చేస్తే ఏ మేరకు అభివృద్ధి సాగుతుందోనన్న అనుమానం వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా గ్రామాలకు కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోయే ప్రమాదమున్నది. అలాగే, గ్రామీణ ఉపాధి హామీ పథకం పూర్తిగా నిలిచిపోతుంది. దీని వల్ల గ్రామాల్లో కూలీలు ఇబ్బందులు పడతారు. మరోవైపు వివిధ పనులు ఆయా గ్రామాల్లోని కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా వేగంగా పూర్తవుతున్నాయి. కానీ, నగరపాలక సంస్థలో విలీనమైన తర్వాత ప్రజలు తమ పనుల కోసం బల్దియా కార్యాలయానికి రావాల్సి వస్తుంది. దీంతోపాటు ప్రజలపై పన్నుల భారం పెరుగుతుందన్న ఆందోళన కనిపిస్తున్నది.

# కేసులు పెట్టడమే ప్రజాపాలనా..?

- ఈ-కార్ రేసులో కేటీఆర్‌పై అక్రమ కేసులు సరికాదు
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, డిసెంబర్ 20: కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఫార్ములా ఈ-కార్ రేసుపై చర్చ పెట్టాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టో అమలు చేసే పరిస్థితి లేక.. ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. ప్రజాపాలన అంటే ప్రశ్నించేవారిపై కేసులు పెట్టడమేనా అని మండిపడ్డారు. ఇల్లంతకుంటలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడానికి ఫార్ములా ఈ-కార్ రేసును ప్రతిష్టాత్మకంగా నిర్వహించిందని తెలిపారు. అయితే మాజీ మంత్రి కేటీఆర్ నిధులు దుర్వినియోగం చేశారని రేవంత్‌రెడ్డి సర్కారు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఏడాది పాలనలోనే కాంగ్రెస్ సర్కారుపై ప్రజలు తిరగబడే పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రొండ్ల తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, నాయకులు కేతిరెడ్డి వెంకట్‌రెడ్డి, వడియాల సత్యనారాయణరెడ్డి, భాస్కర్, సలీం, రఘు, రాజారాం, రాములు, అంజయ్య, భూమయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

# రేవంత్‌రెడ్డివి డైవర్షన్ పాలిటిక్స్

- బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

జగిత్యాల, డిసెంబర్ 20: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు విమర్శించారు. ప్రపంచ దేశాల్లో ఉన్న ఫార్ములా-ఈ రేసును హైదరాబాద్‌లోపెట్టి రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను పెంచిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కక్షసాధింపుతోనే కేసు నమోదు చేశారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా పక్షాన కేటీఆర్‌పై పెట్టిన కేసులను ఖండించారు. జగిత్యాల బీఆర్‌ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలు అమలుచేయకుండా 'ఈ స్కామ్.. ఆ స్కామ్' అంటూ ప్రజలను రేవంత్‌రెడ్డి సర్కార్ మోసం చేస్తున్నదని విమర్శించారు. అసెంబ్లీలో ఈ-కార్ రేసుపై ప్రభుత్వం ఎందుకు చర్చ పెట్టడం లేదో సమాధానం చెప్పాలన్నారు. కేవలం కేటీఆర్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడడం సరికాదని సూచించారు. రాష్ట్రంలోని అన్ని గురుకులాల్లో విద్యార్థుల ఫుడ్ పాయిజన్, పాముకాటు, ఇతర సమస్యలతో బాధపడుతుంటే.. ఆ దృష్టిని మరలించడానికి ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందన్నారు. ఓటుకు నోటు విషయంలో జైలుకు వెళ్లిన రేవంత్‌రెడ్డి.. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బీఆర్‌ఎస్ నాయకులు భయపడేది లేదన్నారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, ఫార్ములా ఈ-కార్ రేసును ₹55కోట్లతో నిర్వహిస్తే ₹700 కోట్ల లాభం జరిగిందన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగిందన్నారు. అయినా కేటీఆర్‌పై అక్రమ కేసులుపెట్టి.. సీఎం రేవంత్‌రెడ్డి రాక్షసానందం పొందుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో గట్టు సతీశ్, అల్లాల ఆనంద్‌రావు, తుమ్మ గంగాధర్, పడిగెల గంగారెడ్డి, అమీన్‌బాయ్, శీలం ప్రవీణ్, ఆయిల్నేని వెంకటేశ్వర్‌రావు, వొల్లాల గంగాధర్,సల్మాన్ పాల్గొన్నారు.

# ఎదుర్కొనే దమ్ములేకనే..

- అక్రమ కేసులు బనాయిస్తున్న కాంగ్రెస్ సర్కారు
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, డిసెంబర్ 20: ఫార్ములా ఈ-కార్ రేసుతో హైదరాబాద్ నగరానికి బ్రాండ్ ఇమేజ్ తీసుకొచ్చిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను నేరుగా ఎదుర్కొనే దమ్ములేకనే కాంగ్రెస్ సర్కారు అక్రమ కేసులు బనాయిస్తున్నదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. ఈ-కార్ రేసులో అవినీతిపై ఆధారాలుంటే అసెంబ్లీలో రేవంత్ సర్కారు అసెంబ్లీలో చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. శుక్రవారం గంగాధరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుంకె మాట్లాడారు. రేవంత్‌రెడ్డి చెర్లపల్లి జైలుకు వెళ్లాడు కాబట్టి.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేపై అక్రమంగా కేసులు పెట్టాలని చూస్తున్నాడని దుయ్యబట్టారు. ఫార్ములా ఈ-కార్ రేసు అంటే తెలియని ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పాలిస్తున్నాడని విమర్శించారు. అవినీతి ఎక్కడ జరిగిందో రేవంత్‌రెడ్డి నిరూపించాలని డిమాండ్ చేశారు. కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టాలని చూస్తే తగిన బుద్ధిచెబుతామని హెచ్చరించారు. ఇక్కడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, మాజీ సర్పంచులు మడ్లపెల్లి గంగాధర్, వేముల దామోదర్, నాయకులు ఆకుల మధుసూదన్, వడ్లూరి ఆదిమల్లు, బొల్లాడిశ్రీనివాస్‌రెడ్డి,ఎండీఅబ్బాస్ ఉన్నారు.

# ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే కేసులా?


- నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, పక్కన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 20: ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతున్నదని నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు విమర్శించారు. ఫార్ములా ఈ-కార్ రేసుతో హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని.. ఓర్వలేకే కాంగ్రెస్ సర్కారు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించిందన్నారు. దమ్ముంటే ఈ-కార్ రేసుపై అసెంబ్లీలో చర్చకు రావాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి రాచరికపు పాలన చేస్తున్నాడని మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లగచర్ల, మూసీ బాధితులతోపాటు ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్న కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందన్నారు. ఈ-ఫార్ములా రేసు నిర్వహణ ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చాయని, అనేక మంది ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖులు ఈ-కార్ రేసుపై ప్రశంసల జల్లు కురిపించారన్నారు. ఈ-కార్ రేసులో డబ్బులు దుర్వినియోగం కాలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ చెబుతున్నాడన్నారు. ప్రభుత్వంలో నాయకులకు స్పష్టత లేకుండా ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ, ఈ-కార్ రేసుతో హైదరాబాద్‌కు ప్రపంచంలోనే ఉత్తమ బ్రాండ్ ఇమేజ్‌ను తెచ్చిన ఘనత కేటీఆర్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. డబ్బు సంచులతో దొరికిన దొంగకు ఎదుటి నాయకులంతా దొంగల మాదిరిగానే కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆంధ్రా పాలకుల బూట్లు తుడిసిన నాయకుడు రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ, ప్రశ్నించే గొంతుకలపై కాంగ్రెస్ సర్కారు అక్రమ కేసులు బనాయిస్తున్నదని మండిపడ్డారు. కేటీఆర్‌పై కేసులు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ సమాజం మొత్తం కేటీఆర్‌వైపు నిలబడుతుందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, నాయకులు బొల్లి రామ్మోహన్, న్యాలకొండ రాఘవరెడ్డి, దిడ్డి రాజు, దార్ల సందీప్, అన్నారం శ్రీనివాస్, బత్తుల రమేశ్, కుంబాల మల్లారెడ్డి, బత్తుల వనజ, నర్మెట ప్రభుదాస్, వెంగళ శ్రీనివాస్, వీరబత్తిని కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

# కక్షసాధింపుతోనే కేటీఆర్‌పై కేసు




గోదావరిఖని: రిలే దీక్షలో ప్లకార్డును చూపుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

- ఖండించిన బీఆర్‌ఎస్ నాయకులు

కరీంనగర్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెట్టడంపై పార్టీ నాయకులు ఆగ్రహించారు. ప్రశ్నించే గొంతుకలను కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేస్తున్నదని, బీఆర్‌ఎస్ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నదని ధ్వజమెత్తారు. శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు ప్రెస్‌మీట్లు పెట్టి మరీ కేటీఆర్‌పై కేసును ఖండించారు. ఈ-కార్ రేసుతో హైదరాబాద్‌కు ప్రపంచంలోనే ఉత్తమ బ్రాండ్ ఇమేజ్‌ను తెచ్చిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందని ప్రశంసించారు. ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రిగా ఆయన ప్రపంచంలోనే గుర్తింపు పొందిన నాయకుడని కొనియాడారు. అలాంటి నాయకుడు ఇప్పుడు ప్రజాసమస్యలు, అక్రమాలపై నిలదీస్తుంటే కాంగ్రెస్ తట్టుకోలేకపోతున్నదని విమర్శించారు. ఆయనను నేరుగా ఎదుర్కోలేకే ఇలా కుట్రపూరితంగా కేసులు పెడుతున్నదని మండిపడ్డారు.

## ప్రశ్నిస్తే కేసులు.. నిలదీస్తే అరెస్టులా?

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, డిసెంబర్ 20: బీఆర్‌ఎస్‌ను, మాజీ మంత్రి కేటీఆర్‌ను బద్నాం చేసేందుకు రేవంత్‌రెడ్డి సర్కార్ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నదని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. ప్రశ్నిస్తే కేసులు.. నిలదీస్తే అరెస్టులు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటైందన్నారు. ఎన్ని కేసులు పెట్టినా.. ఎన్ని అబద్ధాలు ప్రచారాలు చేసినా బెదిరేదిలేదన్నారు. కేటీఆర్‌పై అక్రమ కేసులు ఎత్తివేయాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన 420హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గోదావరిఖని టీబీజీకేఎస్ కార్యాలయ ఆవరణలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో చందర్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టిందన్నారు. ఆ కేసులను ఎత్తివేసే దాకా బీఆర్‌ఎస్ పార్టీ స్థానికంగా చెపట్టిన రిలే దీక్షలు కొనసాగుతాయన్నారు. ఇక్కడ కార్పొరేటర్లు గాదం విజయ, బాదె అంజలి, జనగామ కవిత సరోజని, నాయకులు మూల విజయారెడ్డి, గోపు ఐలయ్యాయాదవ్, నారాయణదాసు మారుతి, అచ్చె వేణు, బొగ్గు రవీందర్, మేతుకు దేవరాజ్, వేణు, శ్రావణ్, తోకల రమేశ్, నూతి తిరుపతి, సింహాచలం, రత్నాకర్, చెలకలపల్లి శ్రీనివాస్, జక్కుల తిరుపతి, నీరటి శ్రీనివాస్,. కృష్ణస్వామి, శ్రావణ్, రామరాజు, తదితరులు ఉన్నారు.

# బీఆర్‌ఎస్‌ను బద్నాం చేసేందుకే..

- డీసీఎమ్మెస్ చైర్మన్ డా శ్రీకాంత్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీఎమ్మెస్ చైర్మన్ డా శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి, డిసెంబర్20: ఫార్ములా ఈ-కార్ రేసుతో తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించిందని కరీంనగర్ డీసీఎమ్మెస్ చైర్మన్ డా ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయిస్తున్నదని విమర్శించారు. శుక్రవారం ఆయన జగిత్యాల జిల్లా ధర్మపురిలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫార్ములా-ఈ కార్‌రేసుతో హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచిన మాజీ మంత్రి కేటీఆర్‌పై రేవంత్ సర్కార్ అక్రమ కేసులు నమోదు చేయించి కక్షసాధింపు చర్యలకు దిగిందని విమర్శించారు. ఎన్ని కేసులు పెట్టినా.. ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసినా బీఆర్‌ఎస్ బెదరదన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా కశ్మీర్‌లో, తమిళనాడు సీఎం స్టాలిన్ చెన్నైలో కూడా ఫార్ములా రేస్ నిర్వహించారని చెప్పారు. ఈ రేసులు కేవలం పెట్టుబడులను ఆకర్షించడానికే మాత్రమే అని విషయం గమనించాలని సూచించారు. ఫార్ములా-ఈ రేసు కోసం అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న హెచ్‌ఎమ్‌డీఏ సంస్థ రెండు దఫాలుగా ₹55కోట్లు కంపెనీకి చెల్లించిందన్నారు. ఆ కంపెనీకి మూడో దఫా కాంగ్రెస్ ప్రభుత్వం డబ్బులు చెల్లించలేక రేసును రద్దు చేసిందన్నారు. కార్ రేసులోపై అసెంబ్లీలో చర్చకు బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తున్నా.. కాంగ్రెస్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం గురుకులాల్లో విద్యార్థుల అవస్థలపై చర్చ జరిగితే దానికి డైవర్షన్ చేయడానికి మరో అంశం ముందుకు తేస్తారని విమర్శించారు. అలాగే ఆరు గ్యారెంటీలను అమలు చేసే పరిస్థితి లేకపోవడంతో బీఆర్‌ఎస్‌పై ఆరోపణలు చేస్తున్నదన్నారు. ఏడాది పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు రాజేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు అయ్యోరి వేణు, యూనుస్, అశోక్, కార్తీక్, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేశ్‌కుమార్ నాయకులు వొడ్నాల మల్లేశం, చిలివేరి శ్యామ్‌సుందర్, అనంతుల లక్ష్మణ్, వేముల నరేశ్,విజయ్, సంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గంగులపై విమర్శలు విడ్డూరం

- ఓటమిఎరుగని నేతపై ఆరోపణలు సరికాదు
- బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్
- తెలంగాణచౌక్‌లో మాజీ మంత్రి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణచౌక్‌లో మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కార్పొరేషన్, డిసెంబర్ 20: కరీంనగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేసిన గంగుల కమలాకర్‌పై నాలుగుసార్లు ఓడిపోయిన కాంగ్రెస్ నాయకుడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు గంగుల కమలాకర్ దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం కరీంనగర్ జిల్లాకేంద్రంలోని తెలంగాణచౌక్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా హరిశంకర్ మాట్లాడుతూ, కరీంనగర్‌లో ఓటమి ఎరుగని నాయకుడిపై విమర్శలు చేయడం సరికాదని సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షంలో ఉన్న సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు తమ మంత్రి వద్ద మెప్పు కోసం మాజీ మంత్రి దిష్టిబొమ్మ దహనం చేశారని విమర్శించారు. ఇకనైనా ఇలాంటి పనులు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, కార్పొరేటర్లు తోట రాములు, బోనాల శ్రీకాంత్, ఐలేందర్, నాయకులు ప్రశాంత్ రెడ్డి, దూలం సంపత్, రాజు, శ్రీనివాస్‌గౌడ్, చేతి చంద్రశేఖర్, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల అరెస్ట్

- 'చలో అసెంబ్లీ'ని అడ్డుకున్న పోలీసులు
- పోలీస్‌స్టేషన్లకు తరలింపు



కరింగనర్ తెలంగాణచౌక్: పోలీసుల అదుపులో ఆటో డ్రైవర్లు

వేములవాడ/కరీంనగర్ కార్పొరేషన్/మెట్‌పల్లి/కరీంనగర్ తెలంగాణ చౌక్/కోల్‌సిటీ, డిసెంబర్ 20: సమస్యల పరిష్కారం కోసం చలో అస్లెంబీకి బయలుదేరిన ఆటో యజమానులు, డ్రైవర్లను శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోలీసులు అరెస్ట్ చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో హైదరాబాద్‌కు వెళ్తున్న ఆటో కార్మికులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ, మహాలక్ష్మి పథకంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన ఉపాధిలేక ఇప్పటివరకు 72మంది కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. అక్రమ అరెస్టలతో కార్మికులను ఆపుతున్నారు గానీ.. తమ ఆకలికేకలను అర్థం చేసుకోవడం లేదని వారు వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో ప్రకారం ఆటో డ్రైవర్లకు రూ.12వేల భృతి కల్పించాలని, ఆటో డ్రైవర్ల కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆటోలకు ఇన్సూరెన్స్ చేయించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా హైదరాబాద్ వెళ్తే అక్రమంగా అరెస్ట్ చేయడమే ప్రజా పాలననా అని ప్రశ్నించారు. కుటుంబాలను పోషించలేక డ్రైవర్లు నానా ఇబ్బంది పడుతుంటే ప్రభుత్వం మాత్రం చర్చలు జరుపుతామని హామీలు ఇస్తూ దాటవేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా హామీలు అమలు చేయాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఆటోడ్రైవర్లకు ఇంత విషం ఇవ్వండి

- ఓట్లు వేసిన పాపానికి బుద్ధి వచ్చింది
- ఆటో డ్రైవర్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ ఆవేదన

కోల్‌సిటీ, డిసెంబర్ 20 : ఆటో డ్రైవర్ల ఉసురు పోసుకోవడం కంటే ప్రభుత్వ పెద్దలే తమకు ఇంత విషం ఇవ్వాలని ఆటో డ్రైవర్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ ఆవేదన వెల్లగక్కారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసినందుకు తమకు బుద్ధి వచ్చిందని, చేతులతో చెంపలను కొట్టుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఒకవైపు ఉపాధి కోల్పోయి ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకుంటుంటే.. ఏదైనా ప్రత్యామ్నాయం చూపించాలని ప్రభుత్వాన్ని అడుగుదామని అనుకుంటే.. అర్ధరాత్రి దాటాక తలుపులు తీయకపోయినా గోడలపై నుంచి ఇంట్లోకి వచ్చి పోలీసులు తమను నిర్బంధించారని ధ్వజమెత్తారు. ఈ మేరకు శుక్రవారం ఆయన గోదావరిఖనిలో విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో నాన్ పొలిటికల్ జేఏసీకి సంబంధం లేకున్నా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా అధ్యక్షులు, మండల నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు ఇదే కాంగ్రెస్ వల్ల రైతన్నలు ఆత్మహత్యలు చేసుకున్నారని, పదేళ్ల తర్వాత మళ్లీ అధికారంలోకి వచ్చి ఇప్పుడు ఆటో డ్రైవర్ల చావులను చూసి కాంగ్రెస్ సర్కారు రాక్షసానందం పొందుతున్నదని మండిపడ్డారు. ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, వెంటనే ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.12 వేలు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట నాయకులు నీలారపు రవి, బత్తుల వెంకట్ తదితరులున్నారు.

# మాటల్లో పెట్టి.. బంగారం దోచి..

- వృద్ధురాలి బంగారం అపహరించిన అగంతకుడు

కోరుట్ల, డిసెంబర్ 20 : కోరుట్లలో సినీఫక్కీలో శుక్రవారం చోరీ జరిగింది. తాను తహసీల్దార్‌నని మాయ మాటలతో వృద్ధురాలిని మభ్యపెట్టి మెడలో ఉన్న బంగారు గొలుసుతో పాటు కమ్మలను అపహరించడం కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. కథలాపూర్ మండలం దుంపేట గ్రామానికి చెందిన వృద్ధురాలు దొప్పల గంగు కీళ్ల నొప్పులకు సంబంధించిన మందులను తీసుకునేందుకు కోరుట్లకు వచ్చింది. మందులు తీసుకొని ఇంటికి వెళ్లేందుకు పాత బస్టాండ్‌లోని నంది చౌరస్తా వద్ద బస్సు కోసం వేచి చూసింది. ఆమెను గమనించిన అగంతకుడు వృద్ధురాలి వద్దకు వెళ్లి మాటల్లో దింపాడు. 'నన్ను గుర్తు పడుతున్నావా.. అమ్మా.. నేను ఎమ్మార్వోను. నీ పింఛన్ డబ్బులు ₹4 లక్షలు బ్యాంకులో జమైనయ్. నేను సంతకం పెడితే నీకు డబ్బులు వస్తయ్' అంటూ మాటల్లో పెట్టాడు. 'లచ్చవ్వ అనే మరో మహిళ బ్యాంకు దగ్గర ఉన్నది. ఆమె తన బంగారు గొలుసు, కమ్మలు ఇంటి వద్ద మరిచిపోయి వచ్చింది. అచ్చం నీ మెడలో ఉన్నట్టు ఉన్నాయి. ఫొటో తీసుకుని తిరిగి తీసుకువచ్చి ఇస్తా' అంటూ బురిడీ కొట్టించాడు. అగంతకుడి మాటలు నమ్మిన వృద్ధురాలు రెండు తులాల బంగారు గొలుసు, అర తులం బంగారు కమ్మలు తీసి ఇచ్చింది. బ్యాంకు దగ్గరకు వెళ్లి వస్తానని చెప్పిన వ్యక్తి ఎంతకూ తిరిగి రాకపోవడంతో మోసపోయానని గ్రహించి లబోదిబో మంటూ పోలీసులను ఆశ్రయించింది. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.